**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**ముఖ్యాంశాలు**

**తేది: 10-03-2025** **సమయం: 1.10 P.M.**

1. రాష్ట్రంలో ఎమ్మెల్యేల కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు నామినేషన్లు ఈ రోజుతో ముగియనుండటంతో అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు.
2. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెరుమాళ్ళ ప్రణయ్ పరువు హత్య కేసులో నిందితులకు శిక్ష విధిస్తూ నల్గొండ ఎస్సీ ఎస్టీ కోర్టు ఈ రోజు తుది తీర్పు వెలువరించింది.
3. రాష్ట్రంలో గ్రూప్ 1 సర్వీసులో 563 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షా ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి.
4. సురక్షితమైన ఆన్లైన్ లావాదేవీలను ప్రోత్సహించడానికి భారతీయ రిజర్వ్ బ్యాంకు ఈ రోజు నుంచి డిజిటల్ చెల్లింపుల అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తోంది.

.........................................

**SLBC**

నాగర్కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద SLBC సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న 8 మందిలో ఒకరి మృతదేహాన్ని నిన్న రాత్రి వెలికితీశారు. మరణించిన వ్యక్తిని టన్నెల్ బోరింగ్ మెషిన్ ఆపరేటర్ గా పనిచేస్తున్న గుర్ ప్రీత్ సింగ్ గా గుర్తించారు. మృతదేహాన్ని నాగర్కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించారు. పంజాబ్ కు చెందిన గుర్ ప్రీత్ సింగ్ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కాగా మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల రూపాయల పరిహారాన్ని ప్రకటించింది. దీనికి సంబంధించిన చెక్కును అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ గురుప్రీత్ సింగ్ కుటుంబ సభ్యులకు నిన్న రాత్రి అందజేశారు. ఈ మృతదేహాన్ని మృతుడి స్వస్థలం పంజాబ్ రాష్ట్రానికి తరలిస్తున్నారు.

PTC నాగర్‌కర్నూల్ జిల్లా

**సావిత్రీ బాయిఫూలే వర్ధంతి**

ఈ రోజు సామాజిక సంస్కర్త, మహిళా విద్య కోసం పాటుపడిన సావిత్రీ బాయి ఫూలే వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆమెకు నివాళులు అర్పిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సావిత్రీ బాయి ఫూలేకు నివాళులు అర్పించారు. దేశంలో తొలి ఉపాధ్యాయురాలు, మహిళా విద్య కోసం పాటుపడిన సంఘసంస్కర్త, వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ధీరవనిత అని కొనియాడారు. విద్యాభివృద్ధికి, హక్కుల సాధనకు కృషి చేసిన భారతీయ సంఘ సంస్కర్త సావిత్రి భాయి ఫూలే అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

డెస్క్

**ఎమ్మెల్సీ నామినేషన్లు**

రాష్ట్రంలో ఎమ్మెల్యేల కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు నామినేషన్ల గడువు ఈ రోజుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులు తమ నామినేషన్లను ఈ రోజు దాఖలు చేశారు. కాంగ్రెస్ తరఫున అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్ నామినేషన్లు దాఖలు చేయగా, కాంగ్రెస్ మిత్రపక్షమైన సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నుంచి దాసోజు శ్రవణ్ నామినేషన్లు సమర్పించారు. కాంగ్రెస్ అభ్యర్థుల వెంట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నారు. కాగా రేపు నామినేషన్లను పరిశీలిస్తారు. 13 వ తేదీ మధ్యాహ్నం వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. ఐదు స్థానాలకు ఐదుగురి కంటే ఎక్కువ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తే ఈ నెల 20న ఎన్నికలు నిర్వహిస్తారు. లేని పక్షంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. డెస్క్

**డిజిటల్ పేమెంట్ అవేర్నెస్ వీక్**

సురక్షితమైన ఆన్లైన్ లావాదేవీలను ప్రోత్సహించడానికి భారతీయ రిజర్వ్ బ్యాంకు ఈ రోజు నుంచి 16వ తేదీ వరకు డిజిటల్ చెల్లింపుల అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తోంది. గత పదేళ్లుగా డిజిటల్ చెల్లింపుల్లో భారత్ గణనీయమైన వృద్ధి సాధించింది. ఈ క్రమంలో ఆన్లైన్ మోసాలు, సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో సురక్షిత డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచేందుకు ఆర్బీఐ ప్రతి ఏటా అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు సురక్షితంగా డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా, ఆన్లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తారు.
డెస్క్

**పీఎంశ్రీ**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎంశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. దీనిలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో 58 శాతం పనులు పూర్తయ్యాయని జిల్లా విద్యాధికారి యాదయ్య ఆకాశవాణికి తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాల్లో ఈ పథకం కింద చేపడుతున్న కార్యక్రమాల గురించి డీఈవో యాదయ్య ఆకాశవాణికి వివరిస్తూ..

సౌండ్ బైట్

ఆసిఫాబాద్ జిల్లా పిటిసి

**పొన్నం ప్రభాకర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ రోజు స్వామి వారిని మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు అవసరమైన

సేవలను అందించేలా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని శ్రీ రాజరాజేశ్వర స్వామిని వేడుకున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, అన్ని వ్యవస్థలు బాగుండాలని కోరుకున్నట్టు తెలిపారు.
పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**గ్రూప్ 1 ఫలితాలు**

రాష్ట్రంలో గ్రూప్ 1 సర్వీసులో 563 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షా ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి. మెయిన్స్ పరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కుల వివరాలను టీజీపీఎస్సీ ఈ రోజు వెల్లడించనుంది. ఈ పరీక్షకు 21 వేల 93 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల మార్కుల వివరాలను టీజీపీఎస్సీ అధికారిక వెబ్సైట్లో ఉంచుతారు. అనంతరం వ్యక్తిగత లాగిన్ లో ప్రతి అభ్యర్థికి తమ మార్కులను రీకౌంటింగ్ చేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం 1:2 నిష్పత్తిలో తుది జాబితాను విడుదల చేస్తారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం తుది మెరిట్ జాబితాను ప్రకటిస్తారు. కాగా రేపు గ్రూప్ 2 జనరల్ ర్యాంకుల జాబితా వెలువడనుంది.
డెస్క్

**గరిమెళ్ల**

తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడు గరిమెళ్ళ బాలక్రిష్ణ ప్రసాద్ మరణం పట్ల పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి భవానీ నగర్ లో గరిమెళ్ల నివాసం వద్ద ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్నారు. గరిమెళ్ల మృతి శ్రీవారి భక్తులకు తీరని లోటని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. అన్నమయ్య రచించిన సంకీర్తనలను స్వరపరచి శ్రీవెంకటేశ్వర స్వామి వైభవాన్ని ప్రపంచ నలుదిశలా వ్యాప్తి చేసిన గొప్ప గాయకుడని కొనియాడారు. గరిమెళ్ల బాలక్రిష్ణ ప్రసాద్‌తో తనకున్న

అనుంబంధాన్ని ప్రముఖ గాయకుడు, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు పారుపల్లి రంగనాథ్ వివరిస్తూ...

బైట్..పారపల్లి రంగనాథన్, ప్రముఖ గాయకుడు, టిటిడి

రేపు మధ్యాహ్నం గరిమెళ్ల అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో తిరుపతిలోని గోవిందధామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది.

ఎన్.జగదీష్, పిటిసి

**అక్రమ విద్యుత్ తీగలు**

పంటల రక్షణ నిమిత్తం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నిర్మల్ జిల్లా విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ సుదర్శన్ తెలిపారు. పంటల రక్షణ కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న సోలార్ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. వీటితో వన్యప్రాణులు, మనుషులకు ఎలాంటి ప్రాణ హాని ఉండదని తెలిపారు. సోలార్ కంచెలు ఏర్పాటుపై విద్యుత్ శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పిటిసి నిర్మల్ జిల్లా.

**జాన్ వెస్లీ**

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎండిపోయిన వరి పొలాలకు ఎకరాకు 50 వేల రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం చిన్న రామన్ చర్ల గ్రామంలో ఎండిన వరి పొలాలను జాన్ వెస్లీ ఈ రోజు సందర్శించారు. వెంటనే వ్యవసాయ అధికారులతో ఎండిపోయిన పంటల సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరారు.

పిటిసి జనగామ జిల్లా

**ఎల్ఆర్ఎస్**

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆధ్వర్యంలో ఎల్.ఆర్.ఎస్. ను అనుసరించి రిజిస్ట్రేషన్ లకు సంబంధించిన విధివిధానాలపై ఈరోజు ఖమ్మం లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ ఎం. రవీందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్లాట్ల యజమానులు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్ ఆర్ ఎస్ కు సంబంధించి తమ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు.

PTC, Khammam

**ప్రణయ్ హత్య**

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెరుమాళ్ళ ప్రణయ్ హత్య కేసులో నల్గొండ ఎస్సీ ఎస్టీ కోర్టు ఈ రోజు తుది తీర్పు వెలువరించింది. కేసులో ఏ2గా ఉన్న సుభాష్ శర్మకు మరణ శిక్ష విధించగా మిగిలిన ఆరుగురు నిందితులకు జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో ఏ1 గా ఉన్న మారుతీ రావు ఆత్మహత్య చేసుకున్నారు. తన కుమార్తెను కులాంతర వివాహం చేసుకున్నాడనే కారణంతో మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారుతీరావు 2018 సెప్టెంబర్ 14న ప్రణయ్ ను హత్య చేయించారని కేసు నమోదయింది. ఈ కేసుకి సంబంధించిన మరిన్ని వివరాలను నల్గొండ ప్రతినిధి జి. రామకృష్ణ అందిస్తారు.

....సౌండ్ బైట్......

పిటిసి, నల్లగొండ జిల్లా......

**యాదాద్రి లో గవర్నర్ పర్యటన..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ పాల్గొన్నారు. ఈ ఉదయం యాదగిరికి చేరుకున్న గవర్నర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి వారిని గవర్నర్

దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న శ్రీ స్వామివారి మహా పూర్ణాహుతి కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు.
పిటిసి, నల్లగొండ జిల్లా.......

**కవిత**

15 నెలల కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష 50 వేల కోట్ల మేర అప్పులు చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళలతో సహా వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ రోజు హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆరోపించారు. రుణంగా తీసుకొచ్చిన సొమ్మును బడా కాంట్రాక్టర్లకు ఇచ్చారని, పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయలేదని కవిత అన్నారు. గత బీఆర్ఎస్  ప్రభుత్వం హయాంలో చేసిన అప్పుల గురించి లెక్కలు తాము చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఆర్థిక ఇబ్బందుల్లోఉందని చెబుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**వాతావరణం :**

రానున్న మూడు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉదయం సమయంలో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. రాబోయే 3 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.
PN